నీటి లెక్కలు తప్పుతున్నాయ్!

- పాత పద్ధతిలోనే వర్షపాతం లెక్కింపు
- మండల కేంద్రంలో వర్షం పడితేనే లెక్కలోకి తీసుకుంటున్న వైనం
- పరిహారం పొందలేక పోతున్నామంటున్న అన్నదాతలు

పెద్దవూర: ప్రతి యేడాది కురుస్తున్న వర్షపు చుక్కల లెక్కలు తప్పుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్నా.. ఇంకా వర్షపాత నమోదులో పాత పద్ధతులే పాటిస్తున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం అమర్చిన ఒక పాత తుప్పు పట్టిన గొట్టంలో ఒక డబ్బాను అమర్చి అందులో పడిన వాననీటిని ఒక బీకరు (డబ్బా)లో పోసి వర్షపాతాన్ని లెక్కిస్తున్నారు. వర్షపాతం కొలిచే సమయంలో పొరపాటున నీటి డబ్బా కింద పడినా, ఒలిగి పోవడమే జరిగితే రెవెన్యూ శాఖ సూచన ప్రకారంగా చెప్పే లెక్కలే శరణ్యం అవుతున్నాయి. ఆ నివేదికనే జిల్లా అధికారులు పరిగణనలోకి తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రెయిన్‌గేజ్ చుట్టూ కంపచెట్లు పెరిగిపోయి రక్షణగా వేసిన ఇనుప కంచె పూర్తిగా ధ్వంసమైంది. నిరంతరం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే అధికారులు చూస్తూ తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.


పెద్దవూరలో ఏర్పాటు చేసిన రెయిన్‌గేజ్

తప్పుడు లెక్కలతో నష్టమే..
వర్షపాతం లెక్కించే పద్ధతి వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పురాతన పద్ధతిలో సాగుతున్న విధానం వలన గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతి సంవత్సరం సీజన్ ప్రారంభంలో వర్షాలు కురుస్తుండటంతో అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతుల సాగు చేసిన పంటలతో నష్టపోతున్నారు. అధికారులు ఏదో ఒక మండలాన్ని తీసుకోవడం వలన ఒక గ్రామంలో వర్షం కురిసి, మరో గ్రామంలో వర్షం కురవకపోయినా అక్కడ వర్షం కురిసినట్లుగానే పరిగణనలోకి తీసుకుంటున్నారు. మండల కేంద్రంలోనే వర్షపాతం లెక్కించే రెయిన్‌గేజ్ (బీకరు) ఉండటం వలన అక్కడ వర్షం పడితే మండలం మొత్తం వర్షం పడినట్లే లెక్కించి మండల అధికారులు, జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నారు. ఇలా చేయడంతో వర్షం కురవని గ్రామాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తప్పుడు లెక్కల కారణంగా ఇన్‌పుట్ సబ్సిడీ, వాతావరణ ఆధారిత పంటబీమా పరిహారం అందక అన్నదాతలు తిప్పలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

పంచాయతీలలో ఏర్పాటు చేయాలి
మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా గ్రామాల్లోని పంచాయతీల వద్ద వర్షపు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసి వర్షపాతాన్ని లెక్కించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇలా చేయడంతో వర్షం కురవని గ్రామాలలో పంట నష్టం అంచనా వేయడానికి అనువుగా ఉంటుంది. దీంతో ప్రభుత్వం ద్వారా పంట నష్టపరిహారం పొందేందుకు అవకాశం ఉంటుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవు

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


దామరచర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యం వహించే వైద్యులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హెచ్చరించారు. గురువారం దామరచర్ల మండల పరిధిలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్యులు సమయపాలన పాటించడం లేదని, ఉదయం 6గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమాన్ని 8గంటలకు ప్రారంభించడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ప్రజలు వ్యవసాయ పనుల నిమిత్తం ఉదయం 9గంటలలోపు వెళ్తారని, ఉదయం 6గంటలకు వైద్యసేవలు అందించాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో విషజ్వరాలు ప్రబలుతున్నందున వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు మెరుగైన వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

వేములపల్లి(మాడ్గులపల్లి) : మాడ్గులపల్లి మండల కేంద్రంలో నిర్మిస్తున్న కేజీబీవీ పాఠశాల భవనాల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సీపీఎం మాడ్గులపల్లి మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. గురువారం మాడ్గులపల్లిలో నిర్మాణంలో ఉన్న పాఠశాల భవన నిర్మాణ పనులను ఆయన సీపీఎం నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. మాడ్గులపల్లి నూతన మండలంగా ఏర్పడిన సంవత్సరం తరువాత కేజీబీవీని కేటాయించగా పది నెలల క్రితం టెండర్ పిలిచి శంకుస్థాపన చేశారని, అప్పటి నుంచి పనులు మందకొడిగా సాగుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేసి విద్యార్థినుల ఇబ్బందులను తొలగించాలన్నారు. కార్యక్రమంలో పుల్లెంల శ్రీకర్, విష్ణు, మల్లారెడ్డి, వెంకయ్య, నాగరాజు, ఫకీర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలను అవమానపరిచిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే మహిళా లోకానికి క్షమాపణలు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఊరేగించి సాగర్ రోడ్డులో దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలైన సబితాఇంద్రారెడ్డి, సునీతలక్ష్మారెడ్డిలను సీఎం రేవంత్‌రెడ్డి అవమానించడం ఎంతవరకు సమంజసమన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం పదవికి అనర్హుడన్నారు. అధికారం ఉందని ప్రతిపక్షాల గొంతునొక్కే ప్రయత్నం చేయవద్దని, అధికారం ఎవరికి శాశ్వతం కాదన్నారు. కార్యక్రమంలో మాజీ ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు లలితహాతీరాంనాయక్, ఇలియాస్, షహనాజ్‌బేగం, కుర్ర చైతన్య, స్వర్ణలత, పెండ్యాల పద్మ, కోదాటి రమా, షోయబ్, వజ్రం, ఆంజనేయరాజు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

హాలియా : అసెంబ్లీలో బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా పార్టీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ వివిధ మండలాల అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, రవికుమార్, హాలియా పట్టణ అధ్యక్షుడు వడ్డె సతీష్‌రెడ్డి, నాయకులు నల్లగొండ సుధాకర్, సురబి రాంబాబు, దోరేపల్లి వెంకటేశ్వర్లు, ఆంనేయులు, సైదాచారి, మహిళలు తదితరులు ఉన్నారు.

దేవరకొండ : అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిండి మాజీ ఎంపీపీ మాధవరం సునీతాజనార్దన్‌రావు అన్నారు. సీఎం అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తెలంగాణ సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జయలక్ష్మి, భారతమ్మ, మురళీ, బాబ, తదితరులున్నారు.


మిర్యాలగూడ : సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


దేవరకొండ : సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


హాలియాలో..

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

మిర్యాలగూడ టౌన్ : పుట్టిన బిడ్డకు తల్లిపాలే ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లీలాకుమారి, రాధిక అన్నారు. గురువారం పట్టణంలోని బాపూజీనగర్, మండలంలోని రాయినిపాలెం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి ముర్రుపాలను పట్టించాలని, ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో బాపూజీనగర్‌లో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, గుత్తా రాణి, శిరసనగండ్ల విజయలక్ష్మి, ఏఎన్‌ఎం సైదమ్మ, ఆయాలు అనంతలక్ష్మి, భవానీ, రోజా, ఆశవర్కర్లు రమాదేవి, సరస్వతి, రాయినిపాలెం గ్రామంలో ఏఎన్‌ఎం, ఆశావర్కర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం
మిర్యాలగూడ : తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.రాధిక అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని రాయినిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ప్రేమలత, ఆశాలు వాణిశ్రీ, హైమావతి, అంగన్‌వాడీ టీచర్ పులి అరుణ, పాపమ్మ, వెంకటనర్సమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరి
అడవిదేవులపల్లి : పుట్టినబిడ్డకు తప్పనిసరిగా తల్లి ముర్రుపాలను తాపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, పోలీసులు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, కిశోర బాలికలు, పిల్లల తల్లులు తదితరులున్నారు.

హాలియా : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం అనుముల మండలంలోని వీర్లగడ్డతండా, పేరూర్ అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లీశ్వరి, అంగన్‌వాడీ టీచర్స్ శోభారాణి, వనమ్మ, ఆశావర్కర్లు, గర్భిణులు, బాలింతలు తదితరులు ఉన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని నెల్లికల్లు అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని నెల్లికల్లులో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరావు, ఏఎన్‌ఎం భవానీ, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

గుడితండాలో తల్లిపాల వారోత్సవాలు
కొండమల్లేపల్లి : మండలంలోని గుడితండాలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిప్పర్తి రాధ గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేష్, అంగన్‌వాడీ టీచర్ ఎన్.విజయ, ఎన్.సుశీల, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

చింతపల్లి : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని సీడీపీఓ లావణ్యకుమారి అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తల్లిపాలలో పోషకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పద్మ తదితరులు పాల్గొన్నారు.


మిర్యాలగూడ : రాయినిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాధిక


హాలియా : తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న రమాదేవి


కొండమల్లేపల్లి : తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిప్పర్తి రాధ


మిర్యాలగూడటౌన్ : బాపూజీనగర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు


తిరుమలగిరి : నెల్లికల్లులో..

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు చరిత్రాత్మకం

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో మాదిగ ఉపకులాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎడ్ల రమేష్ అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 30ఏళ్లుగా మంద కృష్ణ మాదిగ రాజీలేని ఉద్యమాలు చేపట్టారని అన్నారు. అందరికి సమాన హక్కు కల్పించాలనే ఉద్దేశంతోనే ఎస్సీ వర్గీకరణకు నాటి నుంచి బీజేపీ మద్దతు తెలుపుతుందన్నారు. సమావేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, నాయకులు బంటు సైదులు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శివ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పెదమాం భరత్, సీతారాంరెడ్డి, రవిబాబు, రవికుమార్, వెంకన్న, సైదులు, సోములు తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం
మిర్యాలగూడ టౌన్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోవడం పట్ల టీడీపీ పట్టణ అధ్యక్షుడు వడ్డేబోయిన శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ రిజర్వేషన్లపై మొట్టమొదటిగా నారా చంద్రబాబునాయుడే అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. నేడు చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడే ఎస్సీ వర్గీరణపై బిల్లు ప్రవేశపెట్టడం హర్షణీయమన్నారు.

దేవరకొండ : ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని డీవైజేఏసీ చైర్మన్ ఎర్ర కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉపకులాలకు విద్యా ఉద్యోగాల్లో అన్యాయం జరుగుతుందని ఎస్సీ వర్గీకరణ అవసరమని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడం హర్షణీయమన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం
డిండి : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీజేపీ దేవరకొండ అసెంబ్లీ కన్వీనర్ ఏటి.కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన వెంట పార్టీ పట్టణ అధ్యక్షుడు గాయాల రాఘవేంద్ర తదితరులున్నారు.


మిర్యాలగూడ : మాట్లాడుతున్న ఎడ్ల రమేష్

వేములపల్లి : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడం హర్షణీయమని మాజీ ఎంపీపీ పుట్టల సునీత అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అదేవిధంగా మాడ్గులపల్లిలో మాదిగ జర్నలిస్టుల సంఘం మండల అధ్యక్షుడు చిట్యాల సైదులు మాటాడారు.

నిడమనూరు : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బొజ్జ చిన్న, పోలె రవి, గణపాక లక్ష్మణ్, మంద తిరుపతయ్య, కరుణాకర్, యేసు, కేవీటీ, జన్నపాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం
కొండమల్లేపల్లి : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మారుపాక గోపాల్, మండల ఇన్‌చార్జ్ ఎద్దుల ఎల్లయ్య, తిరుపతయ్య, గడ్డం శ్రీరాములు, రుద్రమ్మశ్రీను పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ నేత దైద సత్యం మాదిగ మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్, ఎమ్మార్పీఎస్, నాయకులు తదితరులున్నారు.

అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో..
అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు, 35వ వార్డు కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రావు, సైదులు, శ్రవణ్‌కుమార్ తదితరులున్నారు.

చింతపల్లి : సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు మండల కేంద్రంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వింజమూరి కృష్ణయ్య, యేసు, నర్సింహ, యాదయ్య, వెంకటయ్య, రాధాకృష్ణ, నగేష్ పాల్గొన్నారు.


మిర్యాలగూడటౌన్ : మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

కొండమల్లేపల్లి : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య, ఎస్‌ఐ రామ్మూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీ క్రాంతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మిషన్ పరివర్తన్‌లో భాగంగా మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కోరారు. మాదకద్రవ్యాలు తీసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆంజనేయులు, దుండిగళ్ల అశోక్, కానిస్టేబుల్ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
పెద్దవూర : విద్యార్థులు చదువుపైనే దృష్టి పెట్టాలని, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ పి.వీరబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించి మాట్లాడారు. చదువుకు పేదరికం అడ్డుకాదని, చదువుతో దేనినైనా సాధించవచ్చునని అన్నారు. అనంతరం గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తరి రాము, ఉపాధ్యాయులు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


కొండమల్లేపల్లి : అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ ధనుంజయగౌడ్


పెద్దవూర : విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ వీరబాబు

విద్యార్థులు సన్మార్గంలో నడవాలి
మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా మంచి మార్గంలో నడవాలని మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ కె.నరేష్ అన్నారు. గురువారం మండలంలోని అవంతిపురం గురుకుల పాఠశాలలో మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు డ్రగ్స్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

ఘనంగా తీజ్


మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని సీత్యతండాలో గిరిజనులు తీజ్ వేడుకను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బుట్టలతో గ్రామంలో నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు ధనావత్ చిట్టిబాబునాయక్, గిరిజనులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

మిర్యాలగూడ అర్బన్ : కేంద్ర బడ్జెట్ వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే విధంగా ఉందని, రైతులను కేంద్ర ప్రభుత్వం మరోసారి మోసం చేసిందని రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య అన్నారు. గురువారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో కేంద్ర బడ్జెట్‌పై నిరసన వ్యక్తం చేసిన అనంతరం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చేందుకు పూనుకోలేదని, పైగా ఎరువులకు ఇస్తున్న సబ్సిడీలో కోత పెట్టారని అన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసు ప్రకారం పెట్టుబడికి 50శాతం కలిపి ధరను నిర్ణయించాలని, కొనుగోలుకు చట్టబద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ ప్రస్తావన లేదని, పంటల బీమా నిధులకు కోతలు పెట్టారన్నారు. గతంలో ప్రవేశపెట్టిన మూడు నల్లచట్టాలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎర్రబోతు పద్మ, కన్నకంటి శ్రీను, రామస్వామి, లక్ష్మయ్య, వెంకన్న, రవి, నాగయ్య, భిక్షం, వెంకటయ్య, రవీంద్రచారి తదితరులున్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ


విద్యార్థికి సైకిల్ అందజేస్తున్న రాము

కొండమల్లేపల్లి : మండలంలోని కొత్తబావి గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన మణివర్ధన్‌రెడ్డి అందించిన నోట్ పుస్తకాలు, పెన్నులు, వాటర్ బాటిళ్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండమల్లేపల్లి ప్రెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏరుకొండ రాము మాట్లాడారు. నిరుపేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేసిన దాతను అభినందించారు. అదే విధంగా కొండమల్లేపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి చదువుతున్న గ్రామానికి చెందిన దోమల రాహుల్‌కు సైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమావత్ నాగేశ్వర్, నాయకులు పిల్లి రామస్వామి, కాట్ల కృష్ణగౌడ్, వస్కుల కృష్ణ, యాదయ్య, పిల్లి కృష్ణ, శేఖర్, పిల్లి కొండల్, వెంకటయ్య, అంజి, నరేంద్రబాబు, శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీకి అయేషా ఎంపిక



మిర్యాలగూడ : పట్టణానికి చెందిన అయేషాతఖీ ప్రస్తుతం నాగ్‌పూర్‌లో బీటెక్ చదువుతుంది. ఇటీవల ఎన్ఐటీ నాగ్‌పూర్‌లో జరిగిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ప్రముఖ ఒరాకిల్ ఎంఎస్‌సీ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా రూ.34లక్షల వార్షిక వేతనంతో ఎంపికైంది. కాగా అయేషా తండ్రి ఎండి.నుస్రత్‌అలీ స్థానిక బీసీహాస్టల్ వసతిగృహ సంక్షేమ అధికారిగా విధులు నిర్వర్తిస్తుండగా, తల్లి అజ్మతున్నిసా బేగం ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్నారు.

జానారెడ్డికి వినతుల వెల్లువ

నిడమనూరు : మండలంలోని తుమ్మడం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు యడవెల్లి రంగశాయిరెడ్డి కోడలు లహరిరెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి కుందూరు జానారెడ్డికి పలువురు నాయకులు గురువారం వినతులు అందజేశారు. వివిధ నామినేటెడ్ పదవులు ఇవ్వాలని వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన వారిలో మాజీ ఎమ్మెల్యే ఎన్.భాస్కర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, యడవెల్లి విజయేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నందికొండ రామేశ్వరి మట్టారెడ్డి, కొండేటి మల్లయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరమణ, చేకూరి హనుమంతరావు నాయకులు తదితరులు ఉన్నారు.

అనుమతులు లేకుండా విధులకు గైర్హాజర్ కావద్దు


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమాదేవి

పెద్దవూర : ఉపాధ్యాయులు పైఅధికారుల అనుమతి లేకుండా పాఠశాల విధులకు గైర్హాజర్ కావద్దని ఎంపీడీఓ ఎం.ఉమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశ భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, అంకితభావంతో పనిచేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందించిన పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం పూర్తిస్థాయిలో అందజేయాలని సూచించారు. అనంతరం ఆర్‌పీలు మూడు, ఆరు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు నవంబర్‌లో నిర్వహించే నాసా పరీక్షపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంఈఓ ఎల్.బాలునాయక్, మండల నోడల్ అధికారి శేషు, ఆయా స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఝాన్సీ, శ్రీనివాస్, తరి రాము, ఆర్‌పీలు మేదరి దేవేందర్, నరేందర్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవగాహన

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వరలక్ష్మి మాట్లాడుతూ.. నవంబర్ 12న జరిగబోయే పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలనే అంశంపై ఉపాధ్యాయులకు ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఆర్‌పీలు శివశంకర్, చంద్రశేఖర్, ప్రదీప్, మండలంలోని ఉపాధ్యాయులు తదితరులున్నారు.

హక్కుల సాధనకు పోరాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న మల్లేష్

మిర్యాలగూడ అర్బన్ : కార్మికులు ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మికులు నిత్యం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, పనిచేసే సమయంలో ప్రమాదాలు జరిగి కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కార్మికుడు సంక్షేమ బోర్డులో సభ్యత్వం తీసుకోవాలని, దీంతో సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్మికులు సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, లక్ష్మీనారాయణ, నాయుడు, మందరాజు, సైదులునాయక్, గోవర్ధన్‌రెడ్డి, అజహార్, సోములు, యాదగిరి, బుజ్జిబాబు, వెంకన్న పాల్గొన్నారు.

అనర్హుల పెన్షన్లు తొలగించాలని ఫిర్యాదు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ప్రభుత్వం అందించే ఆసరా పెన్షన్‌కు అర్హత లేకున్నా కొందరు అక్రమంగా పొందుతున్నారని, గుర్తించి వెంటనే వారి పెన్షన్లను తొలగించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షురాలు పెయ్యల గీత గురువారం గ్రామపంచాయితీలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా జీతం తీసుకుంటున్న వారి తల్లిదండ్రులు నేటికి ఆసరా పెన్షన్ పొందుతున్నారని అన్నారు.